# జమ్ జమ్ - ఆ పేరులోనే ఉంది మహత్యం...!

- శాంతి ప్రియ



హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) తన జేష్ఠపుత్రుడైన బాల ఇస్మాయిల్‌ను, సతీమణి అయిన హజ్రత్ హాజిరా (అలైహస్సలాం)ను కాబా ఎగువ భాగాన వదలివెళ్ళిన తర్వాత ఉన్న ఆ కాసిన్ని ఖర్జూరాలు, నీళ్ళూ అయిపోయాయి. ఏ ప్రాణీ నివసించని ఆ రాతి నేలలో తీవ్రమయిన దాహంతో నాలుక పీక్కుపోయింది. చివరికి పసికందుని తాపించేందుకు పాలు కూడా లేకుండా ఇంకిపోయాయి. ఏం చేయాలో, ఎలా దాహం తీర్చుకోవాలో, ఏ విధంగా బాలుడ్ని రక్షించుకోవాలో తోచని అయోమయ స్థితిలో పడివున్నారు హజ్రత్ హాజిరా (అలైహస్సలాం).

అయినా తాను నిరాశ చెందలేదు. నిస్పృహకు లోనవ్వలేదు. తమ వంతు కృషి ప్రారంభించారు. ఒకసారి సఫా కొండపైకి ఎక్కి చూస్తే, మరోసారి మర్వా కొండపైకెక్కి 'నీళ్ళు లభించే మార్గం దొరక్కపోతుందా!' అని ఎదురు చూపులు చూస్తున్నారు. ఇలా సఫా నుండి మర్వా వరకు, మర్వా నుండి సఫా వరకు ఏడు సార్లు దౌడు తీశారు హజ్రత్ హాజిరా (అలైహస్సలాం). చివరికి మర్వా కొండపై ఉండగా ఏదో అలికిడి...! ఏమైవుంటుందా..!! అని బాల ఇస్మాయిల్ వద్దకు చేరుకున్నారు. పసికందు మండుటెండల్లో భరించలేని ఆకలితో అల్లాడిపోతున్నాడు పాపం! అప్పుడే దైవ దూత ప్రత్యక్షమై తమ రెక్కలతో నేలలో రాజేయగా చుక్క నీరు కూడా లభ్యం కాని ఆ నల్లరాతి నేల నుండి జలనిధి పెల్లుబికింది. హజ్రత్ హాజిరా (అలైహస్సలాం) గారు ముందు బాల ఇస్మాయిల్ దాహాన్ని తీర్చి తర్వాత తానూ దాహం తీర్చుకున్నారు. తన అన్వేషణ ఫలించినందుకు, తన శ్రమకు మించిన వరాన్ని దేవుడు అనుగ్రహించినందుకు దైవానికి మనసారా కృతజ్ఞతాభివందనలు తెలుపుకున్నారు.

ఆ పిదప పారే ఆ జలనిధిని చూసి "ఇది ఇలానే పారుతూ ఉంటే అతి తొందరగా అంతమైపోతుంద"ని భావించి, దాని చుట్టూ మట్టితో గట్టు వేస్తూ ఈ జలనిధిని ఎలాగైనా కాపాడుకోవాలన్న తీవ్ర తపనతో ఆమె నోట అప్రయత్నంగా వెలువడిన అమృత వాక్కు 'జమ్ జమ్' (అంటే అప్పటి భాషలో 'ఆగిపో, ఆగిపో' అని అర్థం). ఆ చిన్నపాటి గట్టులో ఆ మహత్తర జలనిధిని ఆపే శక్తి లేకపోయినా ఆమె నోట అపూర్వ విశ్వాసంతో వెలువడిన పలుకు మహిమతో ఆ జలం జలనిధిగా ఓ చోట నిలిచిపోయింది. అదే జమ్ జమ్ బావిగా ప్రసిద్ధి చెందింది.

ఓ సందర్భాన దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "అల్లాహ్ ఇస్మాయిల్ తల్లిని కరుణించుగాక! ఆమె గనక ఈ జలనిధికి గట్టువేసి ఆపివుండకపోతే ప్రళయం వరకూ జమ్ జమ్ జలం పారే సెలయేరయ్యేది."

**జమ్ జమ్ జల నిధి:** జమ్ జమ్ బావి స్వర్గపు సెలయేర్లలోని ఓ సెలయేరు. ప్రవక్త ఇబ్రాహీమ్ (అలైహి) మక్కా కోసం చేసిన దుఆ తర్వాత దేవుడు అనుగ్రహించి ప్రసాదించిన తొలి బహుమతి ఈ జలం. మక్కా అంతటి పవిత్ర నగరం ఉనికిలోకి రావడానికి, జనవాహినితో, దైవ దాసుల రాకపోకలతో అలరారడానికి కారణమయ్యింది ఈ మహత్తర జలం. కొన్ని వేల సంవత్సరాలుగా లభ్యమవుతున్న దేవుని ఏకైక మహిమ ఈ జలం. ఇహలోకంలో దైవ సూచనల్లోని ఓ సూచన ఈ జలం. ఇక్కడికి వచ్చే ప్రతీ యాచకుడు, ప్రతీ బాటసారి తనివితీరా సేవించే అద్భుత ద్రవం ఈ జలం. ఇంతటి మధురమైన నీరు లోకంలో మరో చోట లేదు. ఈ నీటిలో గొప్ప శుభం ఉంది. అది త్రాగే ప్రతీ వారికి ప్రాప్తమవుతుంది. పరిశుద్ధాత్మ అయిన దైవ దూత జిబ్రయీల్ ద్వారా ఉనికిలోకి వచ్చిన అనంత జల సంపద ఈ జమ్ జమ్. ప్రియ ప్రవక్త(స) వారి హృదయం పలుమార్లు ఈ పవిత్ర జలంతో కడగబడింది. ప్రవక్త ఇబ్రాహీమ్ కాలం నుండి అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) వరకు వచ్చిన ప్రవక్తలందరూ త్రాగాలని తహతహలాడిన జలం జమ్ జమ్. ఏ జలానికీ లేని ఈ జలానికి గల ప్రత్యేకత ఏమిటంటే-, ఇది ఆకలిగొన్న వ్యక్తి ఆకలిని తీరుస్తుంది. రోగాన్ని నయం చేస్తుంది. తలనొప్పి, కడుపు నొప్పికి ఇది దివ్య ఔషధం. ఈ జలం వల్ల కంటి చూపు మెరుగవుతుంది. అందుకే ప్రవక్త శ్రీ (స) ఇలా ప్రవచించారు: "మావు జమ్ జమ్ లిమా షురిబ లహు" (ఏ సదుద్దేశంతో జమ్ జమ్ త్రాగుతారో వారి ఆ ఉద్దేశం సిద్ధిస్తుంది.)

ఈ జలాన్ని కడుపు నిండా త్రాగటం విశ్వాసానికి చిహ్నం. కాపట్యానికి విరుగుడు. ఇది పుణ్యాత్ముల కోసం మహోన్నత పానీయం. బంధు మిత్రుల కోసం గొప్ప బహుమానం. అతిథుల ఆతిథ్యం కోసం అద్వితీయ ద్రవ పదార్థం. శరీరానికి శక్తినీ, హాయినీ ఇచ్చే అద్భుత వరప్రసాదం. ఎంత వాడినా అది తరగదు. దాదాపు నాలుగు వేల సంవత్సరాల నుండి ఈ జలం ఇలానే నిర్విరామంగా పెల్లుబుకుతూనే వుంది. ప్రస్తుతం యావత్ప్రపంచంలో అతి ప్రాచీనమైన బావి ఇదేనన్న నానుడీ ఉంది.

**మర్యాదలు:** జమ్ జమ్ జలాన్ని సేవించే సున్నత్ విధానం; ఈ జలాన్ని కుడి చేత్తో బిస్మిల్లాహ్ అని త్రాగాలి. ఈ శుభప్రదమైన జలాన్ని నిలబడి త్రాగటం ప్రవక్త (స) వారి సంప్రదాయం. తనివితీరా ఈ జలాన్ని త్రాగాలి. త్రాగే ముందు మంచి సంకల్పం చేసుకొని మరీ త్రాగాలి. త్రాగిన తర్వాత కృతజ్ఞతగా 'అల్ హమ్దులిల్లాహ్' అనాలి. ఈ జలాన్ని మూడు శ్వాసల్లో త్రాగాలి. ఈ జలాన్ని సేవించిన పిదప ఇహపరాల సాఫల్యం, సౌభాగ్యం, శుభం కోసం దుఆ చేయాలి. ఆ సమయంలో చేసే ఏ మంచి దుఆ అయినా స్వీకరించబడుతుంది.

**జమ్ జమ్ జలం త్రాగే ఓ సౌభాగ్యవంతుడా! శుభాకాంక్షలు !!**